వేగంగా సహాయక చర్యలు

- వందల సంఖ్యలో కూలిన చెట్లు, స్తంభాలు
- పడిన చెట్లను తొలగించి పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ
- సహకరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



పొదలకూరు : నర్సారెడ్డికాలనీలో చెట్టును తొలగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పొదలకూరు : మిచాంగ్ తుపాన్ వల్ల మండలంలో వందల సంఖ్యలో చెట్లు నేలకొరిగి రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధాన రహదారులపై పెనుగాలులకు భారీ చెట్టు నేలకూలడంతో వాహనాలు ఎటూ వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొని రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. పట్టణంలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను తొలగించారు. రాపూరు మార్గంలో ఇనుకుర్తి వద్ద భారీ చెట్టు నేలకొరగడంతో సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ వీరవసంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్‌లతో కలిసి తొలగించారు. అంతే కాకుండా విద్యుత్ తీగలను వారే కత్తిరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పొదలకూరు పట్టణంలోని వీధుల్లో పెద్ద ఎత్తున చెట్లు కూలిపోయి ప్రజాజీవనానికి అడ్డంకిగా మారడంతో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యుడు అంజాద్, పార్టీ నేత బి.భారతమ్మ, పీఆర్ ఏఈ ప్రసాద్ కలిసి చెట్లను తొలగించారు. గ్రామాల్లో రోడ్ల వెంబడి నీడనిచ్చే చెట్లు వందల సంఖ్యలో కూలిపోయాయి. ఆయా గ్రామ సర్పంచులు, వీఆర్వోలు, గ్రామస్తులు కలిసి కూలిన చెట్లను తొలగించారు. ఇనుకుర్తి, ముదిగేడు గ్రామాల మధ్యలో వాగు పొంగి పొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొదలకూరు జెడ్పీహైస్కూల్లో చెట్లు నేలకొరిగడంతో పాటు వర్షపునీరు చేరి మడుగులా మారింది. పొదలకూరు, చెన్నారెడ్డిపల్లి, నేదురుమల్లి గ్రామాల్లో అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బాధితులకు భోజనం అందజేస్తున్నారు.

అంధకారంలో విడవలూరు

విడవలూరు : సముద్ర తీరప్రాంతమైన విడవలూరుపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉంది. విడవలూరు, చౌకచర్ల, ఊటుకూరు, ముదివర్తి, రామచంద్రాపురం గ్రామాల్లోని పలు ఇళ్లల్లోకి నీరు చేరింది. ఈదురుగాలుల ప్రభావంతో చెట్లు, కరెంటు స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో మండల పరిధిలోని గ్రామాలు మూడు రోజులుగా అంధకారంలో ఉన్నాయి. కరెంటు లేకపోవడంతో నీరు కొరత ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు, నాయకులు ఎప్పటికప్పుడు జేసీబీల సాయంతో చెట్లను తొలగించినా మరలా చెట్లు విరగడంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం కలిగింది. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై ఆంజనేయులు మూడు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ బాధితులకు సాయం అందిస్తున్నారు.



విడవలూరు : రోడ్డుపై చెట్లను తొలగిస్తున్న అధికారులు



పొదలకూరు : జెడ్పీహైస్కూల్లో నిలిచిన వర్షపునీరు



పొదలకూరు : రాపూరు మార్గంలో ఇనుకుర్తి వద్ద చెట్ల తొలగింపు

బాధితులకు అండగా నిలుస్తాం



జిల్లా ప్రత్యేక అధికారి, కలెక్టర్‌తో కలిసి కనుపూరు చెరువును పరిశీలిస్తున్న మంత్రి కాకాణి



మనుబోలు : వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : మిచాంగ్ తుపాను బాధితులకు అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండలంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కాకాణి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా గొలగమూడి, అనికేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం వెంకటాచలానికి సమీపంలో ఉన్న కనుపూరు చెరువును జిల్లా తుపాను ప్రత్యేక అధికారి హరికిరణ్, కలెక్టర్ ఎం.హరినారాయణన్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన చర్యల వల్ల ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదన్నారు. వరినార్లు నీట మునిగాయని, ఉద్యాన పంటలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. వరినార్లు దెబ్బతిన్న రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేస్తామని, పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని అంచనా వేసి అన్నదాతలను ఉదారంగా ఆదుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ఈదురు గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కసుమూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి మంత్రి చేరుకుని వారికి ధైర్యం చెప్పి బాధితులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. మంత్రి వెంట జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.

అన్నివిధాలా ఆదుకుంటాం

మనుబోలు : మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన, పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి అన్నివిధాలా అండగా ఉంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మనుబోలు–కోదండరామపురం మధ్య చెరువు నీరు రోడ్డు మీదకు వచ్చిన ప్రదేశాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ విష్ణు, ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, చల్లా నవకోటి, దయాకర్, రమేష్, మహేంద్రవర్మ పాల్గొన్నారు.

నిమ్మతోటలకు అపార నష్టం

- పెనుగాలులకు నేలకొరిగిన నిమ్మచెట్లు
- అతలాకుతలమైన ఆకుతోటలు
- వ్యవసాయ, ఉద్యానాధికారుల పరిశీలన



వేర్లతో సహా నేలకొరిగిన నిమ్మచెట్టు

పొదలకూరు : మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల మండలంలో నిమ్మతోటలను సాగు చేస్తున్న రైతులకు అపారనష్టం వాటిల్లింది. గాలీవానకు తోటలు నేలకొరగడంతో రైతులు కంట కన్నీరే మిగిలింది. తోటల్లో వర్షపునీరు ఉండడంతో చెట్లను చూసుకునేందుకు సైతం రైతులు వెళ్లలేకపోతున్నారు. సోమవారం రాత్రి పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. దీనికి వర్షం తోడు కావడంతో బాగా నానిన చెట్లు విరగబడ్డాయి. మండలంలో ఉన్న ప్రతి నిమ్మతోటల పరిస్థితి ఇలాగే ఉందని రైతులు వెల్లడించారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో నిమ్మతోటలను సాగు చేస్తుండగా ప్రాథమిక అంచనాల ప్రకారం 275 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యానాధికారి ఈ.ఆనంద్ వెల్లడించారు. అయితే ఎన్యుమరేషన్ పూర్తయితే విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నిమ్మతోటలనే జీవనాధారంగా చేసుకున్న మెట్టప్రాంత రైతులు నేలకొరిగిన చెట్లను నిలబెట్టినా బతకడం కష్టంగా ఉంటుందని తెలిపారు. లేత చెట్లు కొంత వరకు బతికే అవకాశం ఉంటుందని, ముదురు చెట్లు ఎట్టి పరిస్థితిల్లో బతకవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ముదురు తోటల చెట్లే అధిక సంఖ్యలో నేలకొరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

అతలాకుతలమైన ఆకుతోటలు

మండలంలోని తాటిపర్తి, విరువూరు గ్రామాల్లో ఆకుతోటల సాగు ఉంది. ఇక్కడ సుమారు 12 ఎకరాల్లో ఆకుతోటలు గాలీవానకు అతలాకుతలం అయినట్లు రైతులు వెల్లడించారు. ప్రాథమికంగా ఉద్యానాధికారి తొమ్మిది ఎకరాల్లో ఆకుతోటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. మిరప 84 ఎకరాల్లో దెబ్బతినిందని అంచనా వేశారు. బొప్పాయి 9 ఎకరాలు, కూరగాయాలు 32 ఎకరాల్లో గాలీవానకు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా సమాచారం సేకరించారు. అయితే ఈ విస్తీర్ణం పెరిగే అవకాశం కూడా ఉందని చెప్పారు. ఇందుకు సంబంధించి ఉద్యానాధికారి ఆనంద్ ప్రాథమిక నివేదికను అందజేశారు. మండలంలో నారుమళ్లలోకి వర్షపు నీరు చేరడంతో మడులను ఏఓ ఎ.వాసు పరిశీలించారు. విరువూరు, సూరాయపాళెం గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు నార్లు పోసుకుని ఉన్నారు.



పాదుల్లో నీరు చేరి విరిగిన నిమ్మచెట్టు



సూరాయపాలెంలో నారుమడుల్లో నీటిని పరిశీలిస్తున్న ఏఓ వాసు



అతలాకుతలమైన ఆకుతోటలు



తోడేరులో నేలకొరిగిన నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న హెచ్‌ఓ ఆనంద్

క్లుప్తంగా

సహాయక చర్యల్లో అగ్నిమాపక శాఖ



నెల్లూరు(క్రైమ్): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో నగరంలోని పలుచోట్ల భారీ చెట్లు నేలకొరిగి ట్రాఫిక్‌తో పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఏడీఎఫ్ఓ వేణుగోపాల్‌రావు తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలను నిరంతరాయంగా చేపట్టారు. రోడ్లకు అడ్డంగా పడిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్నారు. నగర శివారు ప్రాంతమైన తల్పగిరికాలనీ జలమయం కావడంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు. సమాచారం అందుకున్న ఏడీఎఫ్ఓ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని నీటిలో చిక్కుకుపోయిన వారిని తాళ్ల సాయంతో బయటకు తీసుకొచ్చారు. అత్యవసర వేళ ప్రజలు 99637 34284, 99499 91066, 101, 0861 – 2331051 నంబర్లకు సమాచారమివ్వాలని ఏడీఎఫ్ఓ కోరారు.

నిండిన చెరువులు



నిండుకుండలా మారిన పొదలకూరు చెరువు

పొదలకూరు : మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో ఉన్న 52 చెరువులు దాదాపుగా నిండాయి. పొదలకూరు చెరువుతో పాటు కనుపర్తి, అల్లూర్తి, మర్రిపల్లి, మరుపూరు మూడు చెరువులు, డేగపూడి రెండు చెరువులు, తాటిపర్తి రెండు చెరువులు, వావింటపర్తి, బిరదవోలు రెండు చెరువులు, కల్యాణపురం పాట్లేళ్లవాగు చెరువు నిండాయి. సోమవారం నాటికి మండలంలో కొన్ని చెరువులు నిండగా మరికొన్నింటిలో 50 నుంచి 70 శాతం నీరు వచ్చి చేరింది. రాత్రి కురిసిన వర్షానికి దాదాపుగా అన్ని చెరువులు నిండినట్లు అధికారులు వెల్లడించారు.

పొంగిన నావూరు పెద్దవాగు

మండలంలో నావూరు పెద్దవాగు పొంగి ప్రవహిస్తోంది. సోమవారం సాయంత్రం వరకు వాగు మోస్తరుగా ప్రవహించగా రాత్రి పైతట్టు ప్రాంతంలో కురిసిన వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. వాగు ఉధృతి తగ్గితే గ్రామస్తులను అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న నావూరు పెద్దవాగు

స్తంభించిన జనజీవనం

ఇందుకూరుపేట : తుపాను ప్రభావంతో మండల పరిధిలో జనజీవనం స్తంభించింది. రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలు అంధకారంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులు సైతం కాలువలను తలపించాయి. పంటలు నీట మునిగి చెరువుల్లా మారాయి. ఇందుకూరుపేట, జగదేవిపేట, డేవిస్‌పేట తదితర గ్రామాల్లో అరటి పంట నేల వాలింది. చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అధికారులు యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. అధికారులు ముందస్తుగా లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన ఆహారం, పాలు, మందులు అందజేశారు. తహసీల్దార్ సుబ్బయ్య, నాగేంద్రబాబు, కోవూరు సీఐ డి.వెంకటేశ్వర్‌రావు, స్థానిక ఎస్సై వీరేంద్రబాబు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

మనుబోలులో

మనుబోలు : మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు, వీస్తున్న గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోయి అంధకారం అలుముకుంది. ఆదివారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. మండల కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వాటర్ ప్లాంట్లలో కూడా నీరు లేకపోవడంతో ప్రజలు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. చార్జింగ్ లేకపోవడంతో ఫోన్లు కూడా పనిచేయడం మానేశాయి. ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరోవైపు మండలంలోని పలు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి అవసరమైన తాగునీరు, భోజనం, దుప్పట్లు అందజేశారు.



ఇందుకూరుపేట : మొత్తలు గ్రామం వద్ద రోడ్డుపై వాలిన చెట్లు

హైవేపై వరదనీరు

వెంకటాచలం : భారీ వర్షాలతో మండలంలో అన్ని గ్రామాల్లో చెట్లు నేలకొరిగి, విద్యుత్ లైన్లపై తెగిపడటంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. మండలంలోని నిడిగుంటపాళెం, ఇసుకపాళెం, గుడ్లూరువారిపాళెం, కసుమూరు, గొలగమూడి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడి, విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి అధికారులు విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపడుతున్నారు. అలాగే భారీ వర్షాల కారణంగా వెంకటాచలం, చెముడుగుంట గ్రామాల వద్ద జాతీయ రహదారిపై వరద నీరు పారడంతో అధికారులు ఒకే మార్గంలో వాహనాల రాకపోకలకు చర్యలు చేపట్టారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని పులితీగలపాడు వద్ద కనుపూరు కెనాల్‌కు, కసుమూరు చెరువుకు గండిపడ్డాయి. వెంటనే మరమ్మతులు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించడంతో అధికారులు పనులను చేపట్టారు.

కోవూరు : తుపాను ప్రభావంతో గత రెండు రోజుల నుంచి ఈదురుగాలుల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో పెద్ద చెట్లు నేలమట్టమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఇరుమడుగు గ్రామంలో అరటి తోటలు, ఆకుతోటలు నేల వాలింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రెండు రోజుల నుంచి తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ఈదురు గాలులతో చంద్రమౌళినగర్‌లో భారీ చెట్లు నేలకొరిగాయి. పంచాయతీ సెక్రటరీ కృష్ణమూర్తి తక్షణమే స్పందించి సచివాలయం సిబ్బంది ద్వారా సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్, వార్డ్ మెంబర్ అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత సుధాకర్ కలిసి వాటిని తొలగించి సమస్యను పరిష్కరించారు.



ఇందుకూరుపేట : నీట మునిగిన పంట పొలాలు



కోవూరు : కూలిన భారీ చెట్టు



కోవూరు: నేలవాలిన అరటి చెట్లు

అండగా నిలుస్తూ.. భరోసా కల్పిస్తూ..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : తీవ్ర తుపాన్ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు పేదలకు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. మండల పరిధిలోని జొన్నవాడ గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యంనాయుడుతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు 500 మంది గిరిజనులకు మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మోహన మురళీకృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న పేదలకు రెండు రోజులుగా అన్నదానం చేసినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నేత బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేబాలలో..

మండలంలోని రేబాల గ్రామం నెహ్రూనగర్‌లో విద్యుత్‌లేని కారణంగా ఎమ్మెల్యే ప్రసన్న ఆదేశాల మేరకు గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పి.నాగసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మస్తానయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా

విడవలూరు : మిచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం జనరేటర్ సాయంతో విడవలూరులోని అన్ని ప్రాంతాల్లో నీటిని అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పాల్గొన్నారు.

- మండలంలోని పార్లపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జేసీ కూర్మనాథ్ మంగళవారం పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా చౌకచర్ల, గాదెలదిన్నె గ్రామాలను కావలి ఆర్డీఓ శీనానాయక్ పర్యటించారు. వారికి అందిస్తున్న భోజన వసతి మిగతా సౌకర్యాలను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఉన్నారు.



మనుబోలు : నేలకొరిగిన చెట్టు



మనుబోలు : నిలిచిన రాకపోకలు



వెంకటాచలం జాతీయ రహదారిపై పారుతున్న వరద నీరు



వెంకటాచలం : కసుమూరులో విరిగి పడిన విద్యుత్ స్తంభం



విడవలూరు మండల కేంద్రంలో..



విడవలూరు : బాధితులకు ఆహారం అందజేస్తున్న ఆర్డీఓ శీనానాయక్